క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



ఆత్మకూరురూరల్: మండలంలోని రావులకొల్లు ఎస్సీకాలనీలో నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి మందిరంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ నూతన సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలకు విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. ఆత్మకూరుకు చెందిన సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు.

వైభవంగా గజ వాహనోత్సవం



ఆత్మకూరు: పట్టణంలోని సుందరమ్మ కోదండ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గజ వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి గజ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు.

చలివేంద్రం ప్రారంభం



సంగం: సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్థానిక అంజనేయస్వామి ఆలయం వద్ద ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు రాజగోపాలాచార్యులు శనివారం ప్రారంభించారు. తొలుత భరతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. ఆపస్ నాయకులు సురేంద్రరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

శ్రీరామనవమికి ఆలయాల ముస్తాబు



దుత్తలూరు: మండలంలోని రామాలయాలు శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబయ్యాయి. దుత్తలూరు, సోమలరేగడ, నర్రవాడ, తెడ్డుపాడు, బ్రహ్మేశ్వరం, రాచవారిపల్లి, ఏరుకొల్లు, తదితర గ్రామాల్లో నవమి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దుత్తలూరులోని సీతమ్మ బావి వద్ద ఉన్న రామాలయంలో సీతారాముల కల్యాణం, గ్రామోత్సవం నిర్వహించనున్నారు. శ్రీరామనవమి వేడుకలకు స్వగ్రామాలకు వచ్చిన వలసవాసులతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

భవన నిర్మాణ పనుల పరిశీలన



ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి రాజమోహన్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేపడుతున్న భవన నిర్మాణ పనులను ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ ఎం రమణయ్య, ఏఈ శ్రావణ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఉషశ్రీ పథకం కింద కళాశాలకు రూ.5కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అందులో రూ.3.50కోట్లతో తరగతి గదుల నిర్మాణం, రూ.75 లక్షలతో పాతతరగతి గదులకు మరమ్మతులు, మరో 75లక్షలతో ఫర్నీచర్, ల్యాబ్ సౌకర్యాలు కల్పించనున్నట్లు వివరించారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ ఏడాది నవంబర్ నాటికి నిర్మాణాలను పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాంట్రాక్టర్లు జీ శ్రీనివాసులు, బీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకు గరిష్ట ధర రూ. 280 పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 454 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, 331 బేళ్లను కొనుగోలు చేశారు. కిలో పొగాకు గరిష్టంగా రూ. 280, కనిష్టంగా రూ. 230, సరాసరిన రూ. 262.52 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి వీ మహేష్ కుమార్ తెలిపారు. కాగా వేలంలో 10 కంపెనీలు పాల్గొన్నాయి.

నాసిరకంగా సీసీరోడ్ల నిర్మాణం

- టీడీపీ నాయకులే కాంట్రాక్టర్లుగా మారి పనులు
- జేబులు నింపుకోవడమే లక్ష్యంగా నాణ్యతకు తిలోదకాలు
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు
- మూణ్ణాళ్లకే దెబ్బతింటున్న రోడ్లు



కొత్తపాళెంలో నాసిరకంగా నిర్మించడంతో రెండు నెలలకే మధ్యలో బీటలు వారిన సీసీరోడ్డు

జలదంకి: మండలంలో సీసీరోడ్లను నాసిరకంగా నిర్మిస్తున్నారు. టీడీపీ నాయకులు కాంట్రాక్టర్లుగా మారి ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారు. మా ప్రభుత్వం..మా ఇష్టం..మమ్మల్ని అడిగేదెవరు అన్నట్లుగా నాణ్యతను పూర్తిగా విస్మరించి జేబులు నింపుకొంటున్నారు. దీంతో పదికాలాల పాటు ఉండాల్సిన సీసీరోడ్లు మూణ్ణాళ్లకే దెబ్బతింటున్నాయి. మండలంలోని కొత్తపాళెంలో ఎన్ఆర్ఈజీఎస్ నిర్మించిన సీసీరోడ్డు నెలరోజులకే బీటలు వారడమే అందుకు నిదర్శనమే. కొత్తపాళెంలో రైస్‌మిల్లు ప్రాంతం నుంచి బోడగుడిపాడు రోడ్డు వరకు 260 మీటర్ల దూరం సీసీరోడ్డు నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలు మంజూరవగా స్థానిక టీడీపీ నాయకుడు పనులను దక్కించుకున్నాడు. అయితే సదరు కాంట్రాక్టర్ నాణ్యతను పూర్తిగా విస్మరించి పనులు చేపట్టారు. రోడ్డు నిర్మాణ పనులను దగ్గరుండి పర్యవేక్షించాల్సిన పంచాయతీరాజ్ అధికారులు మామూళ్ల మత్తులో చూసీచూడనట్లుగా వ్యవహరించారు. దీంతో రెండు నెలలకే దాదాపు 30 మీటర్ల మేర రోడ్డు మధ్యలో బీటలు వారింది. నాసిరకమైన ఇసుకకు తోడు సిమెంట్‌ను తక్కువగా వినియోగించడంతో ఈ పరిస్థితి నెలకొంది. పెద్ద వాహనాలు తిరిగితే నెలరోజులకే రోడ్డు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ రోడ్డు పరిస్థితిని చూసిన తెలుగు తమ్ముళ్లే మరీ ఇంత దారుణమా అని బాహాటంగా విమర్శిస్తున్నారు. గ్రామాల్లో సీసీరోడ్లను నిర్మించి అభివృద్ధి చేస్తున్నామంటూ ఊదరగొడుతున్న టీడీపీ నాయకులు ఈ సీసీరోడ్డును పరిశీలించి మాట్లాడాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించి సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు రోడ్డును పునర్నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆస్తి పన్నుపై ఐదు శాతం రాయితీ

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ముందస్తుగా పూర్తిస్థాయిలో చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీని ఇవ్వనున్నట్లు కమిషనర్ సీ గంగాప్రసాద్ శనివారం తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు పన్నులు చెల్లించిన వారికి మాత్రమే రాయితీ వర్తిస్తుందని చెప్పారు. పట్టణ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో దొంగల హల్‌చల్

దగదర్తి (కావలి): దగదర్తి మండలంలోని గ్రామాల్లో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఇంటి బయట ఉంచిన వస్తువులు, గ్యాస్ సిలిండర్లను అపహరిస్తున్నారు. ఇటీవల శ్రీరామపురం పంచాయతీ పరిధిలో తరచూ వంటగ్యాస్ సిలిండర్లు మాయమవుతున్నాయి. అర్ధరాత్రి వేళ ఇళ్లలోకి ప్రవేశిస్తున్న దొంగలు గ్యాస్ సిలిండర్లు చోరీ చేస్తున్నారు. అలాగే టిఫిన్ సెంటర్లలోని సిలిండర్లను కూడా మాయం చేస్తున్నారు. శ్రీరామపురంతో పాటు సమీప గ్రామాల్లోనూ ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నట్లుగా గ్రామస్తులు చెబుతున్నారు. ఉలవపాళ్లలో కూడా దొంగల సంచారం ఎక్కువైనట్లుగా స్థానికులు తెలిపారు. పోలీసులు స్పందించి నిఘా ముమ్మరం చేసి చోరీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

కావలి: అణగారిన వర్గాల అభ్యున్నతికి మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ ఎనలేని కృషి చేశారని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలోని క్యాంపు కార్యాలయంలో భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అల్లూరు: స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ యువజన సంఘ రాష్ట్రాధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజ్, అరుంధతీయవాడలో ఎమ్మార్పీఎస్ పట్టణాధ్యక్షుడు దర్శిగుంట కోటయ్య మాదిగ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. అంబేడ్కర్ యువజన సంఘ నాయకులు గంగపట్నం సతీష్, గాలి వేణుగోపాల్, దర్శిగుంట వాసు, కాకాని యశ్వంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడు

వింజమూరు(ఉదయగిరి): మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడని విశ్రాంత డీఎంహెచ్‌ఓ మాసిలామణి పేర్కొన్నారు. స్థానిక బంగ్లా సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. అణగారిన వర్గాల్లో జన్మించి ఎంతో కష్టపడి ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగారన్నారు. తన జీవితకాలానిన ఎక్కువ సమయం పోరాటాలకే అంకితం చేశారన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పందిటి అంబేడ్కర్, ప్రేమదాస్, జీ వెంగయ్య, సింహాద్రి, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: మండల పరిషత్, తహసీల్దార్, ఎంఈఓ, ఉదయగిరి పంచాయతీ కార్యాలయం, ఎంజీఆర్ ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీస్ నాయకుల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ అప్పాజీ, పీఆర్ డీఈ మణికుమార్, ఏపీఓ శ్రీనివాసులు, ఎంఈఓ మస్తాన్‌వలీ, టీడీపీ మండలక న్వీనర్ బయ్యన్న, సొసైటీ మాజీ అధ్యక్షుడు మూలే వినయ్‌రెడ్డి, ఎంపీటీసీ తిరుపతి, ఉపసర్పంచ్ ముర్తాజాహుస్సేన్, ఈఓ కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.



కావలిలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కలిగిరి: స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జగజ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించి అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఉపప్రధానిగా దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నాగూర్‌వలీ, నాయకులు పాల్గొన్నారు.

సీతారామపురం : మండల తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలతో పాటు సీతారామపురం జెడ్పీ హైస్కూల్‌లో మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ సాంఘిక, ఆర్థిక ఇబ్బందుల మధ్య చదువుకున్నారని, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితాన్ని గడిపారన్నారు. చదువుకు ఆరంభం తప్ప అంతం లేదని, మహిళలు చదువుకుంటేనే సమాజం బాగుంటుందని చెప్పారన్నారు. అంటరానితనం వివక్షను రూపుమాపడానికి ఎంతో కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ పీవీ కష్ణారెడ్డి, హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ జ్యోతి, మాజీ ఎంపీపీ అబ్రహం, దళిత నాయకులు ఎలీషాకుమార్, జిల్లా మాలమహానాడు ఉపాధ్యక్షుడు బొగ్గవరపు రత్నం, జాషువా, ఇజ్రాయిల్, వందనం, రాజేష్, కేశవులు, తిరుపతయ్య, మైనార్టీ నాయకులు హైదర్‌అలీ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కిరణ్, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఏవీ రమణయ్య, రవిచంద్ర, ,కేకే రాజు తదితరులు పాల్గొన్నారు.

జలదంకి: మండల పరిషత్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి అధికారులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి దేశానికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. ఎంపీపీ జీ వెంకటరమణయ్య, మండల పరిషత్ సూపరింటెండెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ఆత్మకూరు: మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగా ప్రసాద్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు. చైర్‌పర్సన్ జీ వెంకటరమణ, వైస్‌చైర్మన్ సర్దార్, కౌన్సిలర్లు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

- మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకుడు యేసిపోగు బాబు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆత్మకూరురూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో..



ఉదయగిరి మండల పరిషత్ కార్యాలయంలో..



ఉదయగిరి: ఎంజీఆర్ వ్యవసాయ కళాశాలలో..

ఆత్మకూరు(చేజర్ల): మండల విద్యావనరుల కేంద్రంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంఈఓ పీసీ మస్తానయ్య ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండల పరిషత్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పంచాయతీరాజ్ ఉద్యోగులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మాట్లాడుతూ కేంద్ర కార్మిక, వ్యవసాయ, రక్షణ శాఖల మంత్రి, ఉపప్రధానిగా, ఉపరాష్ట్రపతిగా, రాజ్యాంగ రచనా సంఘం సభ్యుడిగా జగ్జీవన్‌రామ్ ఎనలేని సేవలు అందించారని స్మరించుకున్నారు. దళితుల హక్కుల కోసం తన జీవితకాలం పోరాడారని కొనియాడారు. మండల పరిషత్ ఏఓ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులురెడ్డి, ఈఓపీఆర్డీ డేవిడ్ పాల్గొన్నారు.



అల్లూరులో నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ యువజన సంఘ నాయకులు



చేజర్లలోని ఎంఈఓ కార్యాలయంలో..



ఆత్మకూరులో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



కలిగిరిలో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



ఆత్మకూరులోని మున్సిపల్ కార్యాలయంలో..



వరికుంటపాడు ఎంపీడీఓ కార్యాలయంలో..



సీతారామపురం ఎంపీడీఓ కార్యాలయంలో ..



వింజమూరులో మాట్లాడుతున్న మాసిలామణి



జలదంకి మండల పరిషత్ కార్యాలయంలో..

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, UDAYAGIRI.
O.S No. :18/2024

Andhra Pragathi Grameena bank,
Chakalikonda, Vinjamur(M.D),
Rep.by its Branch Manager........ Plaintiff.
Vs
1.Sandireddy Seshagiri
and Another .... Defendants.

NOTICE

To,
1. Sandireddy Seshagiri
S/o. Koteswara Rao, Thurpu Rompidodla(V), V.K Padu(M.D), SPSR Nellore.

పై నెంబరున వాది మీ నుండి ... 09-04-2025 ... 10:30 ... తేది 08-04-2025.

ఒంగోలు మురళి, B.A.,LLB.,
వాది తరఫు లాయరు, ఉదయగిరి

ఎంపీపీ రాజీనామా చేయాల్సిందే

- అంతవరకు తీర్మానాలను ఆమోదించం
- మండల సర్వసభ్య సమావేశంలో మెజార్టీ ఎంపీటీసీ సభ్యుల డిమాండ్

ఉదయగిరి(వింజమూరు): గతంలో చేసుకున్న ఒప్పందం మేరకు ఎంపీపీ మోహన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని, లేకపోతే ఆయన ప్రతిపాదించిన ఏ తీర్మానాన్ని తాము ఆమోదించబోమని పలువురు ఎంపీటీసీ సభ్యులు స్పష్టం చేశారు. ఈ మేరకు వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మోహన్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్నికల తరువాత మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎంపీపీతో పాటు పలువురు ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరారు. ప్రస్తుతం టీడీపీతో పాటు వైఎస్సార్‌సీపీలోని మెజార్టీ సభ్యులు ఎంపీపీని వ్యతిరేకిస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. కాగా నిబంధనల మేరకు తాము నడుచుకుంటామని ఎంపీడీఓ తెలిపారు. అనంతరం ఎంపీటీసీ పల్లాల కొండారెడ్డి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి సభ్యులు కాని వ్యక్తులను ఎలా అనుమతి ఇస్తారని అధికారులను ప్రశ్నిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యులకు గౌరవవేతనాన్ని వెంటనే మంజూరు చేయాలని కోరారు. అధికారులు తమ శాఖల వారీగా పనుల పురోగతిని వివరించారు. పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివిధ సమస్యలపై అధికారులను నిలదీశారు. చాకలకొండ ఎంపీటీసీ డేగా వంశీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సరుకుల పంపిణీలో నిబంధనలు పెట్టడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎంపీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలన్న ఎంపీపీ తీర్మానానికి మాత్రం అందరూ సభ్యులు ఆమోదం తెలిపారు. మిగిలిన ఎలాంటి తీర్మానాలను ఆమోదించ లేదు. తొలుత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



ఎంపీటీసీ సభ్యులు అందజేసిన వినతిపత్రాన్ని చదువుతున్న ఎంపీటీసీ హైమావతి

భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

సంగం: స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయ పరిసరాలను ఎస్సై రాజేష్, పంచాయతీ కార్యదర్శి నరసయ్య శనివారం సందర్శించారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ సమీపంలో గుంతలను పూడ్చించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణదారులకు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించకుండా నిర్వహించుకోవాలని సూచించారు. ఆలయం వద్ద ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు ఎస్సై తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో సాయంత్రం నుంచి రాత్రి ఒంటి గంట వరకు భారీ వాహనాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.



విద్యతోనే ఉజ్వల భవిష్యత్



వరికుంటపాడు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ-1 షేక్ మస్తాన్‌వలీ అన్నారు. మండలంలోని తూర్పుబోయమడుగుల ప్రాథమికోన్నత పాఠశాలలో వార్షిక వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం సీహెచ్ రమేష్‌బాబు పాఠశాల వార్షిక నివేదికను చదివి వినిపించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి భవిష్యత్‌లో ఉన్నస్థాయికి ఎదిగి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. ఏ స్థాయికి ఎదిగిన విద్యనేర్పిన గురువులు, జన్మనిచ్చిన తల్లిదండ్రలను మరువకూడదన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫైలేరియా బాధితులు జాగ్రత్తలు పాటించాలి



సోమశిల: ఫైలేరియా వ్యాధి బాధితులు తగిన జాగ్రత్తలు పాటించాలని అనంతసాగరం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఖాదర్‌బాషా సూచించారు. మండలంలోని 123 మంది ఫైలేరియా బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన కిట్లను అనంతసాగరం పీహెచ్‌సీలో శనివారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫైలేరియా బాధితులు కిట్లను సద్వినియోగం చేసుకుని వ్యాధి తీవ్రం కాకుండా చూసుకోవాలన్నారు. దోమతెరలు వాడాలని, ప్రతిరోజూ కాళ్లకు నూనె రాసుకోవడం విధిగా అలవాటు చేసుకోవాలని సూచించారు. మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపరాదని తెలిపారు. సీహెచ్‌ఓ జ్యోతి, పీహెచ్‌ఎన్ సుబ్బమ్మ, హెచ్‌వీ శ్యామలమ్మ, హెల్త్‌అసిస్టెంట్ ప్రసాద్, ఆశాలు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలోని 61 మంది ఫైలేరియా బాధితులకు ప్రభుత్వం ప్రత్యేక కిట్లను మంజూరు చేసింది. వాటిని ఉదయగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషద్‌బాబు వరికుంటపాడు పీహెచ్‌సీ సీహెచ్‌ఓకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైలేరియా బాధితులకు ప్లాస్టిక్‌టబ్, మగ్గు, టవళ్లు, సబ్బులు, ఆయింట్‌మెంట్, తదితరాలతో కూడిన కిట్లను ఆరోగ్య, ఆశాకార్యకర్తల ద్వారా మంగళవారం అందజేస్తామన్నారు. వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, సిబ్బంది పాల్గొన్నారు.





